

సోమాజీగూడ యశోద దవాఖానలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నమస్కరిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా

## కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

జనగామ చౌరస్తా, డిసెంబర్ 8 : ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి గాయపడ్డ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద హాస్పిటల్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలిసి పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



రుద్రేశ్వరస్వామికి లక్ష తులసీ దళాలతో అర్చన చేస్తున్న పూజారులు

## రుద్రేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 8 : చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో శుక్రవారం రుద్రేశ్వరునికి లక్ష మారేడు దళాలు, లక్ష తులసీ దళాలతో అర్చన చేశారు. ప్రజలు మానసిక ప్రశాంతతతో జీవించాలని ప్రకృతి సహజమైన మారేడు, తులసీ దళాలతో బిల్వార్చన చేసినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. శనివారం ఆలయ నాట్య మండపంలో సామూహిక సత్యానారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వైదిక కార్యక్రమాలను ఘనాపాటి మణికంఠశర్మ, ప్రణవ్, మేఘనాథాచార్యులు నిర్వర్తించారు.

# ప్రజల మధ్యే ఉంటా.. అభివృద్ధికి సహకరిస్తా

- నిస్వార్థం, నిజాయితీ, నిబద్ధతతో పని చేశా
- వేల కోట్ల నిధులు తెచ్చి హనుమకొండను ఆదర్శంగా తీర్చిదిద్దా
- ప్రజా తీర్పును గౌరవిస్తున్నా
- గెలిచిన వారందరికీ శుభాకాంక్షలు
- విలేకరుల సమావేశంలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, డిసెంబర్ 8 : పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యే ఉంటానని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ. 2005లో ఉద్యమ నేత కేసిఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, అప్పటి పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆహ్వానం మేరకు టీఆర్ఎస్‌లో చేరానన్నారు. అధిష్టానం కార్పొరేటర్‌గా పోటీ చేయమని ఆదేశిస్తే 37వ డివిజన్ నుంచి పోటీ చేసి గెలిచానని, నగర అధ్యక్షుడిగా పని చేశానన్నారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. ఉద్యమంలో రాస్తారోకోలు, ధర్నాలు చేశానన్నారు. ఉద్యమకారులకు ఆర్థికసాయం అందించానని తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం రాజీనామా చేసి గెలుపొందానన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయించానని తెలిపారు. 2014, 2018లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారన్నారు. ప్రభుత్వం ఉన్నత పదవులు ఇచ్చినప్పటికీ ప్రజల మధ్యలో ఉన్నానని చెప్పారు. గుడిసె వాసుల కోసం వామపక్షాలతో కలిసి పోరాడానని తెలిపారు. పశ్చిమ ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించానన్నారు. నగరాభివృద్ధి కోసం నిస్వార్థం, నిజాయితీ, నిబద్ధతతో పనిచేశానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పశ్చిమ నియోజకవర్గంలో గెలిచిన నాయిని రాజేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వివిధ విభాగాల నుంచి పెద్ద మొత్తంలో నిధులను తీసుకువచ్చానని తెలిపారు. గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనటువంటి అభివృద్ధిని వరంగల్ పశ్చిమలో చేశానన్నారు. కొందరు పథకాల అమలులో దుష్ప్రచారం చేశారని, ఎవరితోనూ కక్షపూరితంగా వ్యవహరించలేదని పేర్కొన్నారు. ఓటమిపై విశ్లేషించుకొని ముందుకు సాగుతామని తెలిపారు. పార్టీ పటిష్టతకు పాటుపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు పశ్చిమలో కొన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ఇంకా పూర్తికాని పనులు పూర్తి చేయాలని నూతన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు చెన్నం మధు, వేముల శ్రీనివాస్, బోయినపల్లి రంజిత్ రావు, నలబోల సతీశ్, పులి రజినీకాంత్, నెక్కొండ కిషన్, పరశురాములు, సుగుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### క్రమశిక్షణ గల కార్యకర్తగా పని చేశా..

హనుమకొండ : బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాటి నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేశానని దాస్యం అన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల పాటు ప్రజలకు సేవ చేసిన తర్వాత ఓటమి ఎదురవడం జీర్ణించుకోలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన తపన అంతా గులాబీ కుటుంబ సభ్యుల గురించేనన్నారు. పార్టీ ఆశీర్వదించి అవకాశం కల్పిస్తే 2009, 2010, 2014, 2018లో గెలిచానని, ఈ సారి ఎక్కడ లోపం జరిగిందో ఆత్మ విమర్శ చేసుకుందామని సూచించారు. ఎవరూ ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని భావిస్తున్నానని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సరిగ్గా తిప్పికొట్టలేదని, అది కూడా ఓటమికి ఒక కారణం అని ఆయన పేర్కొన్నారు. ఏనాడూ హంగు ఆర్భాటాలకు పోలేదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేశానని తెలిపారు. వ్యక్తిగత పదవులు అడగలేదని, కాంట్రాక్టులు తీసుకోలేదని అన్నారు. పేదలకు పట్టాలు ఇచ్చేందుకు కృషి చేశానని, గుడిసె వాసుల కోసం 2009 నుంచి ఇప్పటివరకు అనేక ప్రభుత్వ స్థలాల్లో సైతం పట్టాలు ఇప్పించానని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో నాన్యతండాలో గుడిసెలను తొలగించాలని చూసినపుడు వారికి అండగా నిలిచి పోరాటం చేసి పట్టాలు ఇప్పించానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే గుడిసె వాసులను, కుట్టు మిషన్ నిర్వహణ సంస్థలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అధికారపక్షం కక్షపూరిత చర్యలు చేపడుతోందన్నారు. కార్పొరేటర్లు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. పార్టీ అధ్యక్షులు అస్వస్థతకు గురయ్యారని, ప్రతి కార్యకర్త వారి క్షేమాన్ని ఆశిద్దాం అని అన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు.

# రెవెన్యూ గ్రామంగా అక్కంపేట

- నెరవేరిన గ్రామస్తుల చిరకాల వాంఛ
- రెవెన్యూ గ్రామంగా గుర్తిస్తూ సర్కారు జీవో జారీ
- జీవో కాపీని ప్రజలకు అందజేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహం వద్ద అక్కంపేట రెవెన్యూ జీవో పత్రాన్ని చూపిస్తున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గ్రామస్తులు

ఆత్మకూరు, డిసెంబర్ 8 : తెలంగాణ సిద్ధాంతకర్త, దివంగత కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామమైన అక్కంపేట ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి అక్కంపేట గ్రామంలోని జయశంకర్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు రేవూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటిస్తూ జారీ చేసిన జీవో పత్రాన్ని విగ్రహాల సాక్షిగా ప్రజలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జయశంకర్ పుట్టి పెరిగిన గ్రామానికి రెవెన్యూ హోదా కావాలనేదే ప్రజల చిరకాల వాంఛ అని, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఈ గ్రామానికి రచ్చబండ కార్యక్రమానికి వచ్చారని, ప్రజలు అక్కంపేటను రెవెన్యూ గ్రామం చేయాలని విన్నవించుకున్నారనారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ గ్రామంగా ప్రకటిస్తానని చెప్పారని, ఇచ్చిన మాట ప్రకారం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా మార్చుతూ జీవో పత్రం అందజేశారన్నారు. జీవో కాపీని గ్రామానికి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పరకాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాననే నమ్మకం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు, గీసుగొండ ఎంపీపీలు మార్క సుమలత-రజనీకర్, బీమగాని సౌజన్య, జడ్పీటీసీ కక్కెర్ల రాధికారాజు, మండలాధ్యక్షుడు కమలాపురం రమేశ్, జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోపు మల్లికార్జున్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ముద్దం సాంబయ్య పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీచక్రస్నాన ఘట్టం..

లింగాలఘనపురం, డిసెంబర్ 8 : జీడికల్‌లో ఘనంగా శ్రీచక్ర స్నాన ఉత్సవాన్ని పూజారులు శుక్రవారం పూర్తి చేశారు. ఆలయ గర్భగుడిలో కొలువు దీరి ఉండే శ్రీచక్రాన్ని జీడికల్ గుట్టపై ఉన్న పుష్కరిణి(గుండం) వరకూ ఊరేగిస్తూ తీసుకెళ్లారు. పుష్కరిణిలో ప్రత్యేక పూజలు చేసి స్నాన ఘట్టాన్ని ముగించారు. వైస్ ఎంపీపీ కొండబోయిన కిరణ్‌కుమార్, ఈవో శేషుభారతి, వంశపారంపర్య ఆస్థాన పూజారులు గట్టు రంగాచార్యులు, గట్టు శ్రీనివాసాచార్యులు, పూజారులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, ఆచార్య వర్చిశ్, బుచ్చయ్య శర్మ, సిబ్బంది కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

## నిట్‌లో జనవరి 19 నుంచి టెక్నోజియాన్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 8 : వరంగల్ నిట్‌లో జనవరి 19 నుంచి 21 వరకు టెక్నోజియాన్ నిర్వహిస్తున్నట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. శుక్రవారం నిట్‌లో టెక్నోజియాన్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సర ఎడిషన్ థీమ్ 'ఇంజీనియస్' అని తెలిపారు. ఇంజీనియస్ అంటే ఆవిష్కరణ అని అర్థమని స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచార్య తెలిపారు.




# వృద్ధురాలి ప్రాణం మీదకు తెచ్చిన కేవైసీ పుకార్లు

- గంటల తరబడి లైన్‌లో నిలబడి కిందపడిపోయిన సమ్మక్క
- ప్రైవేట్ వైద్యుడి వద్దకు తరలించి ప్రథమ చికిత్స చేయించిన మహిళలు



కేవైసీ చేయించడానికి వచ్చి అస్వస్థతకు గురైన వృద్ధురాలికి చికిత్స చేస్తున్న వైద్యుడు

నల్లబెల్లి, డిసెంబర్ 8 : కేవైసీ పుకార్లు ఓ వృద్ధురాలి ప్రాణం మీదకు తెచ్చాయి. ఈ దఫా తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారుడు కేవైసీ చేయించుకుని ఉండాలనే పుకార్లు మండలంలో వ్యాపించాయి. దీంతో ఉదయం ఏడు గంటలకే మహిళలు, వృద్ధులు మండలకేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరుతున్నారు. శుక్రవారం క్యూ లైన్లో గంటల తరబడి ఉన్న గొల్లపల్లె గ్రామానికి చెందిన 70 ఏండ్ల సల్వాల సమ్మక్క లోబీపీతో కింద పడిపోయింది. వెంటనే అక్కడున్న వారు సమీపంలోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఈ ఘటన పై మహిళలు, ప్రజలు గ్యాస్ ఏజెన్సీ వారి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవైసీ గురించి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు.